క్లుప్తంగా

పైనాపిల్ పండ్లతో క్షీరారామ లింగేశ్వరస్వామికి అలంకరణ


క్షీరారామలింగేశ్వరునికి ప్రత్యేక అలంకరణ

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం క్షీరారామ లింగేశ్వర ఆలయంలో స్వామి వారిని సోమవారం సుమారు 100 పైనాపిల్ పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు అనిల్ ఈ అలంకరణ ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

శాకంబరిగా లక్ష్మీపార్వతి అమ్మవార్లు


శాకంబరిగా పార్వతి అమ్మవారు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మి, పార్వతి అమ్మవార్లను శాకంబరిగా అలంకరించారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరణ చేస్తారు. ఈ సందర్భంలో సోమవారం పార్వతి దేవి, లక్ష్మీ దేవిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామివారికి అభిషేకాలు, జనార్దనస్వామికి అర్చనలు చేసిన అనంతరం అమ్మవార్ల అలంకరణను తిలకించి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కిష్టప్ప అమ్మవార్లకు అలంకరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి యార్ల సూర్యనారాయణ పాల్గొన్నారు.

28న పోడూరు మండల పరిషత్ సమావేశం

పోడూరు: ఈ నెల 28వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ. డి.సుహాసిని సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమావేశానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా అనిల్‌కుమార్

పెనుమంట్ర: భట్లమగుటూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ ఉందుర్తి అనిల్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు పీపీ యూనిట్ నుంచి బదిలీపై వచ్చి ఈ బాధ్యతలు చేపట్టారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెన్మెత్స విశ్వనాథరాజు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు ఈది అనితప్రవీణ్, డాక్టర్ కొడాలి ప్రదీప్‌కుమార్, విజయ్‌కుమార్, పెద్దిరాజు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ భద్రతా వారోత్సవాలు


పాలకొల్లు రూరల్ సబ్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో మాట్లాడుతున్న ఏఈ

పాలకొల్లు అర్బన్: విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్‌మేన్, జూనియర్ లైన్‌మేన్, సాంకేతిక సిబ్బంది రక్షణ పరికరాలు వినియోగించి విధులు నిర్వహించాలని ఎలక్ట్రికల్ ఏఈ వీవీ సత్యనారాయణ కోరారు. జూన్ 28 నుంచి జూలై 2వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం పూలపల్లి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. లైన్ ఇన్‌స్పెక్టర్లు అమీరుద్దీన్, నీలిపూడి వెంకట్రావు, లైన్‌మేన్ సురేష్‌బాబు, అసిస్టెంట్ లైన్‌మేన్‌లు, నాని, సతీష్, జేఎల్ఎంలు నరేష్ పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు


పెనుగొండలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి స్పందన

పెనుగొండ: ఎరువులు, పురుగు మందుల దుకాణాలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి స్పందన హెచ్చరించారు. సోమవారం పెనుగొండ మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లో బిల్లులను, రిజిస్టర్లను పరిశీలించారు. స్టాక్ బోర్డులు ఎప్పటికప్పుడు రైతులకు తెలియచేసే విధంగా అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగు మందులు అందించాలన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమం


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు


ఆచంటలో విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న శ్రీరంగనాథరాజు

పెనుగొండ: అర్హత ఉన్న ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం తూర్పుపాలెంలో ఆచంట నియోజకవర్గంలో పెనుగొండ, పోడూరు, ఆచంట, పెనుమంట్ర మండలాలకు చెందిన తహసీల్దార్లు, ఎంపీడీవోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదన్నారు. దీని కోసం నెలరోజుల పాటు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతి ఇంటింటికీ వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు, గృహసారథులు, కన్వీనర్లు వెళ్లి సమాచారాన్ని సేకరించాలన్నారు. ఇబ్బందులు ఉంటే సత్వరం పరిష్కరించాలన్నారు. అదేవిధంగా సచివాలయం ద్వారా అందిస్తున్న 11 ఉచిత సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకూ దేశంలో ఎక్కడా ఇటువంటి కార్యక్రమం జరగలేదన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవో ఎప్పటికప్పుడు నిత్య పర్యవేక్షణ చేసి విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ సేవలు పేదలకు అందించాలి

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు పేదలకు అందించేందుకు అధికారులు అందరూ కృషి చేయాలని మాజీ మంత్రి , వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. నూతనం బాధ్యతలు చేపట్టిన పెనుమంట్ర మండలం భట్లమగుటూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఉందుర్తి అనిల్‌కుమార్, పోడూరు ఎంఈవో గాది వెంకట సూర్యనారాయణ, పోడూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పినిశెట్టి బుజ్జేశ్వరరావు సోమవారం తూర్పుపాలెంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో పోడూరు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, వైద్యాధికారి కొడాలి ప్రదీప్‌కుమార్, విజయ్‌కుమార్ రాజు, పెనుమత్స విశ్వనాథరాజు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాలు

పెనుగొండ: సాంకేతిక విద్యా కోర్సులతోనూ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంట ప్రభుత్వ ఐటీఐలో ఏపీఎస్ఎస్‌డీసీ నిధులతో పునర్నిర్మించిన రెండు తరగతి గదులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇటీవల షార్ట్‌టర్మ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. యువతకు రాష్ట్రంలో అవకాశాలను సృష్టించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకున్నారని తెలిపారు. సాంకేతిక విద్య వల్ల విద్యార్థులు త్వరితగతిన ఉన్నతస్థాయికి చేరుకుంటారన్నారు. ఆచంట ఐటీఐలో కళాశాలకు అవసరమైన పరికరాలు అందిస్తానన్నారు. మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్సులను ప్రవేశ పెడితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు, ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా డీఎస్‌డీవో అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, జిల్లా కన్వీనరు భీమవరం ఐటీఐ ప్రిన్సిపాల్ వి శ్రీనివాసరాజు, రామేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆచంట సెక్రటరీ కడియాల సురేశం, ఆచంట ఎంపీటీసీ ఉల్లం జ్యోతి, ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ రాజు, ఆచంట మండల సర్పంచ్ ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో ఆరోగ్య సమస్యలు


ర్యాలీలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, ఎస్ఈబీ అధికారులు


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది పోలిశెట్టి శ్రీరఘురామారావు


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి

పాలకొల్లు సెంట్రల్: నేడు యుక్త వయస్సులోనే కొందరు మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతున్నారని దాని వల్ల భవిష్యత్ పాడవుతుందని ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఛాంబర్స్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చిరంజీవి మాట్లాడుతూ 1987లో ఐక్యరాజ్యసమితి ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఏటా జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. యువత ముందు సరదాగా మత్తు పదార్థాలను అలవాటు చేసుకుని చివరకు వాటికే బానిసలుగా తయారవుతున్నారన్నారు. వీటి వల్ల శారీరక, మానసిక అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. ముందుగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఎం సీతాహారిక, కె శైలజ కృష్ణవేణి, వి యామిని సుధాలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుచుకున్నారన్నారు. కళాశాల చైర్మన్ కాయమూరి నరసింహారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పర్యవేక్షించాలి

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా ఉండాలంటే తల్లిదండ్రులు వారి పట్ల ఎప్పుడూ స్నేహపూర్వకమైన పర్యవేక్షణ చేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ వరలక్ష్మి అన్నారు. సోమవారం మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి వరలక్ష్మి మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి ప్రభాకరరావు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సీహెచ్ గణేశ్వరరావు, న్యాయవాదులు ఎం అనంతలక్ష్మి, ఆర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో..

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి అన్నారు. స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణ ఎస్ఈబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థి దశలో చెడు అలవాట్లకు దూరంగా ఉంటే మంచి భవిష్యత్ ఏర్పడుతుందన్నారు. ఎస్ఈబీ సీఐ ఎల్ చిరంజీవి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు వినియోగం వాటిని కలిగిఉండడం చట్ట రీత్యా నేరమని అన్నారు. ఒకసారి ఇటువంటి కేసుల్లో దొరికితే జీవితాంతం ఈ కేసులు వెంటాడుతూనే ఉంటాయన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు, ఎస్ఈబీ అధికారులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఏఎస్సై మార్‌లింగం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ డాక్టర్ బి సుబ్బలక్ష్మి, డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు టి కృష్ణ, జగపతిబాబు, పూజిత పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనారోగ్యం

నరసాపురం రూరల్: యువత మాదక ద్రవ్యాల మత్తులో శారీరకంగా, మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని సీనియర్ న్యాయవాది, వైఎన్ కళాశాల ట్రెజరర్ పోలిశెట్టి శ్రీరఘురామారావు అన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నరసాపురం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో వైఎన్ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణపై న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నక్క కుమార్‌రత్నం, ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి దేవేంద్ర ఫణికర్, నారిన శ్రీనివాసరావు,న్యాయవాదులు దొంగ నర్సింహారావు, ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు వివరించారు.

జుత్తిగ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ కమిటీ ఎంపిక

పెనుమంట్ర: పాఠశాలల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా భాగస్వాములై భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులతో సహకరించాలని జుత్తిగ ఉన్నత పాఠశాల హెచ్ఎం, పేరెంట్స్ కమిటీ కన్వీనర్ ఆర్ మణిభారతి అన్నారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతోపాటు పేద విద్యార్థులకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ సందర్భంగా పేరెంట్స్ కమిటీ చైర్మన్ వీరవల్లి రామకృష్ణమూర్తి అధ్యక్షతన నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా రామకృష్ణమూర్తిని తిరిగి కొనసాగిస్తూ, ఉపాధ్యక్షుడిగా మల్లుల జ్యోతితో పాటు జుత్తిగ అరుణ, కట్టా కృష్ణమూర్తి, కదలి లక్ష్మీదుర్గను కొనసాగిస్తూ నత్తి హారిలక్ష్మి, ముప్పిడి రజని, సందూరి శ్రీను, నత్తి దుర్గా భవాని, నక్కా హేమలత, వీరవల్లి వరలక్ష్మి, నార్నెడిమిల్లి సీతమ్మ, కొప్పూరి పూజ భూలక్ష్మి, కొప్పూరి లక్ష్మి, అనంతపల్లి నాగేశ్వరరావులను నూతన కమిటీ సభ్యులుగా ఎంపిక చేసినట్లు కన్వీనర్ మణిభారతి తెలిపారు.

జాతీయ జట్టుకు పెనుగొండ విద్యార్థి ఎంపిక


పవన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సూర్యనారాయణ

పెనుగొండ: అండర్ 19 జాతీయ వాలీబాల్ జట్టుకు పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థి కలిరి పవన్‌కుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కొల్లి సూర్యనారాయణ తెలిపారు. సోమవారం కళాశాలలో విద్యార్థిని అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన పోటీల్లో ప్రతిభను కనబరచడంతో జాతీయ జట్టులోకి తీసుకున్నారని తెలిపారు. గతేడాది రాష్ట్ర వాలీబాల్ జట్టుకు పవన్ ఎంపికై ప్రతిభ చూపాడని వివరించారు. జాతీయ జట్టుకు ఎంపికైన పవన్‌కుమార్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర కె రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, జిల్లా వాలీబాల్ అసోషియేషన్ కార్యదర్శి డాక్టర్ జీవీ పవన్‌కుమార్ రాజు, పీడీ బి దుర్గారావు అభినందించారు.

అర్హులందరికీ న్యాయం చేయాలి


మేడపాడులో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్

యలమంచిలి: అర్హులైన ప్రజలందరికీ జగనన్న సురక్ష పథకంలో న్యాయం చేయాలని తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్ ఆదేశించారు. మేడపాడులో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేలో అడుగుతున్న ప్రశ్నలను నిశితంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే ద్వారా ఉచితంగా అందుతున్న సర్వీసులను ప్రముఖంగా వినిపించాలని చెప్పారు. సర్వేలో లేని సమస్యలు ఎదురైతే అదర్స్‌లో నమోదు చేయమని చెప్పారు. ముఖ్యంగా చిన్న లోపాల వల్ల పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలు అందని పేదలకు, పట్టాదారు పాసు పుస్తకాలు, మ్యూటేషన్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఈ పథకం ద్వారా సత్వర న్యాయం అందేలా చూడాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ గంటా కాంతకుమారి, ఎంపీటీసీ డేగల సూర్యప్రభ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ కుక్కల బాలచంద్రన్, డేగల వెంకటేశ్వరరావు వీఆర్వో తోట శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్ ఉమర్ అలీష తదితరులు ఉన్నారు.

1 నుంచి జగనన్న సురక్ష గ్రామసభలు

పోడూరు: మండలవ్యాప్తంగా జూలై 1వ తేదీ నుంచి 22వ తేదీ వరకు అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ డి.సుహాసిని తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామసభల వివరాలు వెల్లడించారు. ఎంపీడీఓ సుహాసిని, డిప్యూటీ తహసీల్దార్ డి.రాజేష్ పర్యవేక్షణలో కొన్ని గ్రామా సచివాలయాల పరిధిలో, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు పర్యవేక్షణలో మరికొన్ని గ్రామ సచివాలయాల పరిధిలో గ్రామసభలు నిర్వహించనున్నారు. ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్ పర్యవేక్షణలో జూలై 1న పోడూరు-1, 4న గుమ్ములూరు-1, 6న కవిటం-1, 11న కవిటం-2, 13న పోడూరు-2, 15న జిన్నూరు-1, 18న పెనుమదం-1, 20న కొమ్ముచిక్కాల, 22న మట్టపర్రు సచివాలయాల పరిధిలో గ్రామసభలు నిర్వహించనున్నారు. తహసీల్దార్, ఈఓపీఆర్‌డీ పర్యవేక్షణలో జూలై 1న తూర్పుపాలెం, 4న గుమ్ములూరు-2, 6న పి.పోలవరం, 11న జగన్నాథపురం, 13న పండితవిల్లూరు, 15న జిన్నూరు-2, 18న పెనుమదం-2, 20న వేడంగి, 22న వద్దిపర్రు సచివాలయాల పరిధిలో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుహాసిని తెలిపారు.

28న డీఎన్నార్ మహిళా కళాశాలలో జాబ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు సోమవారం ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కళాశాల ఆవరణలో జీల్ కంపెనీ జాబ్ మేళా నిర్వహిస్తుందన్నారు. ఈ మేళాలో ఎంపికైన విద్యార్థులకు 20 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. సంవత్సరానికి రూ. 1.8 నుంచి రూ. 3 లక్షల వరకూ ఆదాయం ఉంటుందన్నారు. ఈ ఇంటర్వ్యూలకు డిగ్రీ పాసైన విద్యార్థులు, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం


చింతపర్రులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న, డా. అద్దాల ప్రతాప్‌కుమార్, వైద్య సిబ్బంది

పాలకొల్లు అర్బన్: వర్షాకాలంలో సహజ సిద్ధంగా వ్యాపించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెడికల్ ఆఫీసర్ డా. అద్దాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మండలంలోని చింతపర్రు గ్రామ సచివాలయ ఆవరణలో ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆరోగ్య సిబ్బందితో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో మురుగు గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ నీటిలో దోమల లార్వాలు పెరగడానికి వీలుంటుందన్నారు. వర్షాకాలంలో దోమల కారణంగా డెంగీ, మలేరియా, చికున్ గున్యా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్‌లో 75 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ పెన్మెత్స వెంకట కృష్ణంరాజు, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు కృష్ణవేణి, శ్రావణి, హెల్త్‌అసిస్టెంట్ తారక్, ఏఎన్ఎం అనిత, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయాలి


ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో నాగేశ్వరరావు

పెనుమంట్ర: ఉపాధ్యాయులు పాఠశాలలో ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తూ విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని మండల విద్యాశాఖాధికారి ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తూ, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యలో నూతన ఒరవడిని సృష్టించేందుకు విద్యావ్యవస్థలో పెనుమార్పులు ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఉపాధ్యాయులు నూతన సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధన అలవర్చుకోవాలని అందుకు ప్రభుత్వమే శిక్షణ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకుని శిక్షణలో మంచి ప్రావీణ్యత సంపాదించాలన్నారు. మూడు నుంచి 5 తరగతుల వరకు శిక్షణ ఇచ్చే శిక్షణలో ప్రతి ఉపాధ్యాయుడు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ శిక్షణ రిసోర్సు పర్సన్ వీఎస్ఎల్ఎం ఆచార్యులు , పి ప్రవీణ్, ఎల్ రామస్వామి, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో నాగేశ్వరరావును వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

లాయర్ల ప్రయోజనం కోసమే వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు


పాలకొల్లు కోర్టు ఆవరణలో హర్షం వ్యక్తం చేస్తున్న జూనియర్ లాయర్లు

పాలకొల్లు అర్బన్: లాయర్ల ప్రయోజనం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అడ్వకేట్ జనరల్ పర్యవేక్షణలో రూ.100 కోట్లతో వెల్ఫేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు పాలకొల్లు కోర్టు ఆవరణలో సోమవారం జూనియర్ లాయర్లంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ థ్యాంక్యూ సీఎం అంటూ నినాదాలు చేశారు. లా నేస్తం పథకం అమలు ద్వారా ప్రతి నెలా రూ.5వేలు చొప్పున ఏడాదికి రూ.60వేలు నిధులు జూనియర్ లాయర్ల ఖాతాల్లో జమ చేయడం వారి ఉన్నతికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. లా కోర్సు పూర్తి చేసి కొత్తగా ప్రాక్టీస్ ప్రారంభించిన లాయర్లకు పెద్దగా కేసులు రావని, ఈ సమయంలో వారికి పుస్తకాలు, ఇతర నిర్వహణ ఖర్చులు అందించడం వల్ల భవిష్యత్తులో మంచి లాయర్లుగా రాణించడానికి వీలు కలుగుతుందని వినిస్టన్‌బాబు వివరించారు. అలాగే వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు వల్ల లాయర్లకు రుణాలు పొందడానికి, మెడికల్ బిల్లుల ద్వారా ఆర్థిక ప్రయోజనం పొందవచ్చన్నారు. లాయర్ల కోసం మంచి పథకం అమలు చేసిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. లీగల్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వడ్లపాటి ఆనంద రాజు, జూనియర్ లాయర్లు జీపీ సుదర్శన్, కత్తుల సత్యనారాయణ, బావన సునీల్, గూడపాటి సత్యశ్రీ, రొంగల చందు, ఆకుల సుబ్రహ్మణ్యం తదితరులు హర్షం వ్యక్తం చేసినవారిలో ఉన్నారు.

జగనన్న పాల కేంద్రాలతో పాడి రైతులకు లాభం

యలమంచిలి: జగనన్న పాల కేంద్రాలతో పాడి రైతులకు లాభం, గౌరవం లభిస్తుందని పశువైద్యుడు పోరెడ్డి చంద్రశేకరరెడ్డి చెప్పారు. మేడపాడులోని ఆర్‌బీకేలో సోమవారం ఆయన పాడి రైతులతో సమావేశమై జగనన్న పాలవెల్లువ కేంద్రాలకు పాలు పోయడం వల్ల కలిగే లాభాలను వివరించారు. జగనన్న పాల వెల్లువ కేంద్రాల్లో పాలు పోసే రైతులకు 11 వెన్న శాతం వస్తే లీటరు పాలకు రూ.88 వరకు అత్యధిక ధర ఇస్తారన్నారు. పాలు వేసే రైతులకు సబ్సిడీపై సంపూర్ణ మిశ్రమ దాణా, పశువుల కొనుగోలుకు రుణ సహాయం, ప్రతి పది రోజులకు బిల్లు, పశువుల ఆరోగ్య సమస్యలకు సత్వర వైద్యం, కేవలం రూ.384 చెల్లిస్తే మూడేళ్లపాటు పశువుకు రూ.30 వేలు బీమా పథకం వర్తిస్తుందన్నారు. జగనన్న పాల కేంద్రాలకు రైతులు పాలు పోసి అధిక లాభం పొందాలని ఆయన కోరారు. మేడపాడు సర్పంచ్ గంటా కాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్ వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం మళ్ల సోని, పాలవెల్లువ రూట్ ఇన్‌చార్జి ఆనందరాజు, వెటర్నరీ అసిస్టెంట్ బళ్ల దుర్గాభవాని పాల్గొన్నారు.